పాలిష్‌చేయబడిన బూట్లూ నడుపుతున్న అపమృత్యువు వాతపడి, సేట్‌జీ లాల్చీజేబు లోంచి కానిస్టబుల్ దఃసరి నిక్కరుజేబులోకీ, పళ్ళమ్మి చిరుగుల జాకెట్ మరుగుకూ బదిలీఅయిన నోట్లకిందపడి, పళ్ళమ్మి చెప్పిన ఒకేఒక అబద్ధంకిందపడి, కానిస్టబుల్ గద్దింపులకిందపడి, అల్యూమినియం గిన్నె దూరంగా జారిపడినా పావలానాణెం కింద పడిపోకుండా బిగించిన పిడికిలితో అలాగే చనిపోయాడు.

కిటికీవద్ద నిల్చున్న రచయిత కిటికీతెరవేసి వెనక్కువచ్చి ఫోల్డింగ్‌కుర్చీలో కూర్చుని అంతకుముందే తెరచివుంచిన ఫౌంటన్‌పెన్‌తో ఏదో వ్రాయడానికి వుపక్రమించాడు, కాని పాళీ ఎప్పుడో ఆరిపోయింది, విసుగ్గా విదిలించాడు. చారలు చారలుగా సిరా కక్కింది కలం.

---

కథ

# వేళ్ళు

పింగళి రంగారావు.

---

వార్డు జోగుతూ నిద్రపోతున్నట్లుగావుంది. రాత్రికూడా అట్టేకాలేదు. అరచి అరచి పేషంట్లు మగతగా నిద్రపోతున్నారు. అక్కడో లైటు అక్కడో లైటు మబ్బుగా వెలుగుతున్నాయి. దూరంగా అరగంటకో నర్సు వార్డు ప్రక్కనుంచి అగుపడి మాయమౌతోంది. గతరాత్రిలా వార్డులో అలజడి లేదు. పదిగజాల దూరంలో నుండి పిల్లలు కొట్లాడుతున్నట్లుగా పిల్లలవార్డునుండి అరుపులు వినొస్తున్నాయి—

నిద్రపోతున్నవాన్నెవరో లేపుతున్నారు. అస్పష్టంగా మూల్గులు.

విసుక్కుంటూ లేపేవ్యక్తి "మందు" అంటోంది—

తాను విసుక్కుంటూ ప్రక్కకు తిరిగాడు.

"మందు త్రాగండి."

విషంలా మ్రింగాడు. మళ్ళీ చెదిరింది నిద్ర. అవే ఆలోచనలు. గొంతులో సెగవేస్తున్నట్లుగావుంది. తానింతటి దురదృష్టవంతుడౌతాడని కలలోకూడా అనుకోలేదు.

వసంత ఇంట్లో ఏంచేస్తోందో— ఏంచేస్తుంటుంది, నానిబుజ్జిని గుండెల కత్తుక్కుని ఏడుస్తుంటుంది. దిక్కులేని దేవుళ్లకు మొక్కుతూ వుంటుంది. వేంకటేశ్వ

రునికి ముడుపుకడుతానంది– కట్టిందో! తెల్లవారేసరికి కొబ్బరికాయలు కొడుతానంది. కొడవటంచగుళ్లో తడిబట్టలతో ప్రదక్షణాలు చేద్దామంది– చల్లగావుంటే సత్యనారాయణ వ్రితం నోముకుందామంది. వెక్కి–వెక్కి ఏడ్చింది,

వసంతను మించిన దుఃఖం తనకొచ్చింది. ఏంచేద్దాం. విధిబలీయం– అనే గుండెనిబ్బరంగాని, ఓపికగాని తనలో లేవు.

ఆ సాయంకాలం తనను చూడటానికి యెందరో వచ్చారు. స్నేహితుల సంఖ్యకు లెక్కలేదు. ఆ రెండుగంటలసేపూ వస్తున్నారు, పోతున్నారు, నవ్వుతూ మందలించేవాళ్లు. తేలిగ్గా పెదవులతో పైపైన్నే అదోరకపు సైగలతో పలకరించేవాళ్లు. బంధువులో!....

వాళ్ళూ వచ్చారు. ఓస్! ఈపాటికే యింత యిదైపోవాలా!

“వాడు మొదటినుండీ పిరికే.” అంటున్నారు.

తనతోడుగా జీవిస్తున్న భార్య వెక్కివెక్కి ఏడుస్తూంది– పదిమంది ఉమ్మడిగా గొంతు ఎత్తి దానిమీద మాటలతో విరుచుకపడ్డారు. అంతకుతగ్గ బొంతే అని యీసడించారు. జారిన తన కన్నీటితో వసంత కన్నీరు ఏకమైనట్లుంది.

గొంతుదాటి రాలేనిమాటలు లోపలికే జారుకుంటున్నాయి. కళ్ళతో మందలిద్దామన్నా కంటినిండా నీరు.

చేతులతో సంజ్ఞచేద్దామనుకుంటే....

ప్చ్. అంత అదృష్టమా!

ఈక్షణంతో తాను ఆ అదృష్టాన్ని కోల్పోయాడు.

తలచుకుంటేనే గుండె చెలిమైపోతోంది.

తన వేళ్ళు!....

“వసంతా! ఈ వేళ్ళతో నీకన్నీటిని ఎలాతుడవను! ఊరుకొమ్మని నీతలను ఎలా నిమురను!”

“అమ్మో”–

వార్డులో అంతా ఉలిక్కిపడ్డారు. తాను ప్రక్కకు తిరిగిచూశాడు.

నర్సు పరుగెత్తుకుంటూ వచ్చింది,

ఉన్నపలంగానే వాంతిచేసుకుంటున్నాడు ప్రక్కబెడ్‌వాడు.

నర్సు ‘ఇంజెక్షన్’ చేస్తోంది. చూడలేక కనులు మూసుకొని తాను పక్కకు తిరిగాడు.

"పక్కబెడ్‌వాడు బ్రతికేనమ్మకం లేదు."

రెండోపక్కవాడు తనతో అంటున్నాడు.

రెండో ప్రక్కవాణ్ణి పరికించి చూశాడు.

ముఖమంతా కాలిపోయింది. వాడు అంతకుక్రితమే చెప్పాడు మూకుడులోని నూనె లేచి ముఖంపై పడిందని.

వాడు నవ్వుతున్నాడో, ఏడుస్తున్నాడో కూడా తెలియటంలేదు.

వాడి మాటలవల్ల ఊహించాల్సిందే!

బ్రతికి బైటపడ్డానన్న సంతోషమే అయివుంటుంది—

లేకుంటే, ఆ పళ్లు ఎందుకు యికిలిస్తున్నాయి!

తన్నుచూసి అదృష్టవంతు డన్నాడు.

ఆ మాటకు తాను ఎన్నిసార్లు ఏడ్చాడో!

ముఖంకాలిన వ్యక్తిని చూసి వసంత ఉలిక్కిపడింది. బెరుగ్గా తనవైపు చూసింది. వాడేనయం— అన్నట్లుగా చూశాయి తనచూపులు. వసంతను మళ్ళీ ఏడ్పించాడు తాను!

ప్రక్కకు ఒత్తిగిల్లాడు. కుడిచేతి నరాలన్నీ లాగుతున్నాయి. శారీరకమైన బాధకంటే, తనలో మానసికయుద్ధమే అంతకంతకూ చెలరేగుతోంది.

"ఏడుస్తున్నావురా!" తనకు తోడుగావున్న ఉపేన్ బుజ్జగించాడు.

తలగడలోకి దూరి కుమిలాడు.

చివరిసారిగా వేళ్లను తడుముకున్నాడు.

తన వేళ్ళు!.... ....

* * *

ఆజంజాహి మిల్లుకు టైం అవుతోంది.

హడావిడిగా తయారై మెట్లుదిగుతున్న తన కాళ్ళను రెండుచేతులా వాటేసుకున్నాడు నాని బుజ్జి. ఏమరుపాటులోవుంటే, ఈపాటికి తాను చివరిమెట్టుక్రింద మరో మెట్టులా అడ్డంగా పడిపోయేవాడే. కొద్దిలో తప్పింది. ఎంతకూ చేతులనుసడలించడు బుజ్జి. ముద్దుపెట్టుకొని, అమాంతంగా తన చేతులతో పైకెత్తుకున్నాడు. బుజ్జి భుజం కొరుకబోతే, వాడిని ఆపేప్రయత్నంలో తన వేళ్ళు నానినోటిలో చిక్కాయి. వేళ్ళను కటుక్కున కొరికాడు. కోపంతో, బాధతో తాను బుజ్జివెన్నుపై ఒక్కచరుపు చరిచాడు. పెంకులెగిరిపోయేలా నాని బుజ్జి గొంతెత్తాడు.

వంటింట్లోనుండి ఏదో కొంప మునిగిపోయిందన్నట్లుగానే వసంత పరుగెత్తుకొచ్చింది. అమ్మను చూసేసరికి వానిగొంతు హెచ్చుస్థాయిలోకి వెళ్ళింది. ఇల్లంతా తిరుగుతూ బుజ్జగిస్తోంది, చాక్లెట్లడబ్బానే కుమ్మరించింది. ఎన్నోబొమ్మలు ముందు వేసింది. అదే ఏడ్పు! రా అమ్మా— రా నాన్నా— అంటూ తాను చేతులు చాచాడు. ఏడుస్తూనే తన చేతులపై వాలిపోయాడు. బుజ్జిని భుజానవేసుకొని జోకొడుతూ తాను యిల్లంతా తిరిగాడు లయగా తన వేళ్ళు బుజ్జి వెన్నుమీద ఆడుతున్నందుకు ఏడుస్తూ ఏడుస్తూనే కళ్లుమూసుకున్నాడు పిచ్చితండ్రి.

విసుగుతో. కోపంతో కొట్టిన వేళ్ళు—
లాలిస్తూ ప్రేమగా బుజ్జిని నిద్రపుచ్చే వేళ్ళు—
తనవేళ్ళు!— —
"మిల్లునుండి ఎప్పుడొస్తారు."
అంది వసంత భైముడిని సవరిస్తూ—
"రాత్రి పదింటికి"
ఊ— అంది బుంగమూతి పెడుతూ.
"ఏం! పెందరాళే రావాలా! నాయిష్టంవచ్చినప్పుడే పోవటం, రావటమా—"
"రావాలనుకుంటే రాగలరు."
"ఏలాగో!"
"నాకళ్ళల్లోకి చూసి చెప్పండి. వస్తారుగా!"

నవ్వుతూ వసంత చెక్కిళ్లను నిమిరాడు. తన వేళ్ళలో ఏం స్పర్శవుందో గోముగా తనమీద వాలింది. తలంటుకొని నొదులుగా ముడివేసుకున్న వసంత వెంట్రుకల్లో తాను మల్లెల మాలను తురిమాడు. ఆప్యాయంగా వసంత తన కళ్లలోకి గుచ్చి చూస్తూ తన వేళ్లను ముద్దుపెట్టుకుంది.

ఆనందాన్ని తట్టుకోలేక వసంత చెక్కిళ్ళపై చిరుదెబ్బవేసిన వేళ్ళు— (ఒకప్పుడు కోపంలో, విసుగులో, గృహసమస్యలతో— వసంత చెక్కిళ్లను గట్టిగా మందలించిన వేళ్ళే—)

మిల్లుకు హడావిడిగా బైటపడుతూ కూడా మాటి మాటికి తన యింటి మూల మలుపు తిరిగేదాకా, వసంతా, బుజ్జిలు కడపలో నిల్చుంటే బై బై చెప్పుతూ గాలిలో చేయి ఊపాడు.

చల్లని వేళ్ల, ప్రేమతో బుజ్జగించే వేళ్ల—
తనవేళ్ళు!.... ....

385

బస్‌స్టాండ్‌లో బస్సు ఆగింది. అరగంటకో బస్సుగాని రాదు. మనస్సు, మనిషి శరీరం మొత్తం బస్సుకోసమే త్రొక్కులాడుతుంది. వేరే ఆలోచనలే వుండవు. ఎప్పుడో ఒకప్పుడుగాని బస్సురాదు. కురుక్షేత్రం జరుగబోతున్నట్లుగా రద్దీ– ఒకర్నొకరు తోసుకోవడం– మళ్ళీ మామూలు, బస్సు వెళ్ళుతుంది. అయినా తీరిగ్గా ఊపిరి తీసుకొనే వీలుందా. తొడుక్కున్న చెప్పులను మనకు తెలియకుండానే లాగివేసే పాలిష్‌చేసే కుర్రాళ్ళు. ఎంత కసురుకున్నా వింటేగా!

బస్‌స్టాండ్‌లో ఎల్లప్పుడూ నిల్చుని బిచ్చమెత్తుకొనే పోలిగాడు. పైస యివ్వకుంటే బస్సుకిందపడి చస్తానంటాడు, వాడంటే తనకు ఎంతోయిష్టం. వాడు రోలరులా తన ఆకారంతో అక్కడినుండి పరుగెత్తుకొస్తున్నాడంటే, అనుకోకుండానే తన చేతులు జేబుల్లోకి వెళ్ళిపోతాయి. (ఆత్మహత్య చేసుకుంటాడేమో అని).

వాడిమీద తనకు అదోరకమైన వెర్రిప్రేమ. తనకాళ్ళను వంగి ముద్దుపెట్టుకొనే పోలిగాడంటే తనకు జాలి.

తన చేయి దయగలదంటాడు,

పిచ్చిగా దినం తన చేతివేళ్ళను ముద్దుపెట్టుకుంటాడు–

ఆఫీసులోకి అడుగుపెట్టగానే మొట్టమొదటిసారిగా తనకు అగుపించేది శివరావు. తన రాకకోసమే ఎదిరిచూస్తాడేమో! చూపులనిండా విషం!

మనిషి యికిలించి నవ్వుతుంటే, ఒళ్లంతా కదులుతుంది, పెదవులు మోటుగా, లావుగా వుంటాయి. దరహాసమన్నది వాణి ముఖంమీదలేదు. తనమీద శివరావుకు ఎందుకో పగ? మొదటినుండీ గిల్లికజ్జాలే!

ఎన్నోసార్లు తాను శివరావువల్ల నష్టపోయాడు. మానసికంగాకూడా తాను కృంగిపోయాడు. తనమీద ఎన్నో 'కంప్లేంట్స్' చేశాడు. తనదంతా 'మిస్ అప్రాప్రియేషన్'గా దుమారంలేపాడు. ఆ సుడిగాలినుండి తప్పుకోవడానికి తనకు కొన్నివందలైనా అయివుంటుంది....

శివరావ్, నీకిది న్యాయంకాదంటే పళ్ళు బైటపెట్టి ఛ. నేనలాంటివాన్ని కాదోయ్– అంటాడు.

వాడినిచూసేసరికి తన వొళ్లంతా మండుతుంది, ఎన్నడో ఒకరోజు శివరావువల్ల తన ఉద్యోగంకూడా వూడిపోతుంది. తన బ్రతుకు బజారుపాలవుతుంది, తనతో కలసి మెలసి తిరుగుతూనే, తనకిందకి నీళ్ళు తెస్తున్నాడు. 'శివరావ్! నిన్ను ప్రాణాలతో వదులుతానా!'– వాడిముఖం జ్ఞాపకం వచ్చేసరికి ఒళ్లంతా కాగిపోతుంది.

386

నరనరం పొంగిపోతుంది. తన ఈ చేతులతో శివరావ్‌గొంతు నులిమెయ్యాలి. చిత్రహింసలు పెట్టాలి........ పిడికిలి బిగుసుకపోతుంది. ఆవేశంతో తనవేళ్ళు వణికిపోతుంటాయి.

ప్రతీకారంకోసం, అవకాశంకోసం వేచివున్న తన చేతులు.... ....

వెక్కి వెక్కి ఏడ్చాడు తాను,

"ఏంరా! భయపడుతున్నావా?" ఉపేన్ అడిగాడు.

లేదంటూ తలవూపాడు మౌనంగా.

"ఛ! ఈమాత్రిందానికే భయపడాలిరా! వేళ్ళ ఆపరేషన్‌కే యింత యిదైపోతే, నీపక్క బెడ్‌వాడు ఏమైపోవాలి! మిషన్‌లో నీచేయి పడటమే లక్కీఅనుకో! ఏ కాలో మరేదో యిరుక్కుపోతే ఎలావుండు? 'ఆఫ్టరాల్ ఫింగర్స్'–" అన్నాడు.

"ఒరేయ్! మరేమైనా బాధపడకపోదు. నేను బ్రతికివుండికూడా లాభంలేదు. చచ్చిపోతేనే అదృష్టవంతుణ్ణి.

"మరీ ఇంత పి.కివాడవటోయ్!" అంటున్నాడు ముఖం కాలిన వ్యక్తి.

"చేతివేళ్ళు తెగిపోతున్నందుకే బాధపడుతున్నావ్! జీవితంలో ఎంత మంది ఎంత విలువగలవాటిని కోల్పోయారు. ప్రపంచాన్ని తృప్తిగానైనచూడలేక మధ్యలోనే కళ్ళుపోయిన వాళ్ళున్నారు. మొండికాళ్లతో బ్రితుకుతున్నవాళ్లున్నారు. నిజం చెప్పాలంటే. పురుషత్వాన్ని కోల్పోయికూడా. చావలేక బ్రితుకుతున్న వాళ్ళున్నారు. ఒకప్పుడు నేనెంతో అందగాణ్ని.... నారూపాన్నిచూసి నేనే మురిసిపోయేవాణ్ణి. కాని. ఈరోజు– ఎలావున్నాను? అసహ్యంగా లేనూ? నీకేకాదు. నామీద నాకే అసహ్యం కలుగుతోంది! అంటూ మరోప్రక్కకు తిరిగాడు. కన్నీటిని తుడుచుకుంటున్నాడేమో-

వేళ్లు తెగిపోతున్నందుకు తాను బాధపడొద్దా!

ఏదిలేకుంటేనేం. వేళ్లులేకుండా ఎలా జీవించడం!

ఈ వేళ్ళే ప్రతి సృష్టికి రూపాన్నిస్తున్నాయి–

ఈ వేళ్ళే ప్రతి రూపాన్ని నాశనం చేస్తున్నాయి–

శాంతిని ప్రసాదించే చల్లని వేళ్లు!

క్రాంతిని రెచ్చగొట్టే బలమైన వేళ్లు!!

పసివాణ్ణి లాలించే అప్పుడు, సుకుమారమైన గులాబిని భార్య సిగలో పెడుతున్నప్పుడు, కోపంలో బుజ్జగిస్తున్నప్పుడు, ప్రేమతో నిమురుతున్నప్పుడు, కసిలో శివరావుపై ప్రతీకారం తీసుకోవాలనుకున్నప్పుడు– తన వేళ్ళే తనకంటె ముందుగా మమతను. విముఖతను తెల్పాయి!

387

వసంతా! ఈ ప్రపంచం ఒక్క బ్రతుకటాన్నే నేర్చుకుంది. మొండిగా నైనా జీవించాలట. మనిషికి ఏది లోపించినా లెక్కచేయని లోకం! జీవించటానికి ఏ అడ్డము లేకుంటేచాలు ఈ మనుషులకు– ....

ఈ చేతులను ఎందుకు సృష్టించాడు భగవంతుడు?

అందాన్ని సృష్టించటానికి, మంచిని ఎత్తిచూపటానికి, చెడును నిర్మూలించటానికి కాదూ?

బ్రతికివుంటే బలుసాకు కూర తినొచ్చట!

తన వొక్కనికి లేకుంటేనేం, లోకంలో అందరికీ వేళ్ళున్నాయిగా! అదే ధైర్యమైవుంటుంది లోకానికి!

తెల్లవారింది.

నడిపించుకుంటూ తనను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లుతున్నారు–

(కాళ్ళులేకుంటె 'స్ట్రెచర్'మీద వెళ్ళకపోదూ!)

వసంతా, నానిబుజ్జి, స్నేహితులు, బంధువులు, శివరావు అంతా వరుసగా నిలుచున్నారు.

అందరి ముఖాలు ప్రశాంతంగా వున్నాయి.

డాక్టర్ క్రిష్ణారావు 'వెరీ మైనర్ ఆపరేషన్'- అన్నాడని మిత్రుడంటున్నాడు.

మైనరా!

సృష్టి ఆగిపోయే సంఘటన!

ప్రపంచం మునిగిపోయే దుర్గతి!

కాదూ.... కాదూ....

అందరి వేళ్ళూ ఒక్కసారిగా తెగిపోనీ! ఆలోచించరేం! యింకా మనం జీవిద్దామనే అంటారా?

భార్యకదూ, ఆడది– అందుకని ఏడుస్తున్నదేమో.

చివరిసారిగా తన తృప్తికోసం నరాలన్నీ ఓవైపు ప్రాణంతీసేలా లాగుతున్నా 'బై' చెప్పుతూ గాలిలో చేయిఊపాడు.

ఆపరేషన్ టేబిల్‌మీద పడున్నాడు.

డాక్టర్ చేతుల్లో 'స్కాల్‌పెల్'

అసిస్టెంట్ చేతుల్లో కత్తెరవుంది–

అనెస్థీషియన్ చేతుల్లో ఇంజక్షన్

నర్స్‌చేతిలో గాజ్‌వుంది–

ఎన్ని.... ఎన్ని.... ఎన్ని వేళ్లు!

తనవేళ్ళను తెగ్గొట్టటానికి ఎన్ని వేళ్ళు—?
తనవేళ్ళో!
కళ్ళు మూసుకొమ్మన్నారు.
నర్సువేళ్ళతో తన కళ్ళను మూసింది.
ధర్మంగల వేళ్ళు—
నర్సు! నీవి చల్లని వేళ్ళు.

---

## నాకునచ్చిన ఇద్దరు కథకులు

సోదుం రామమోహన్.

---

ఆంధ్రదేశంలో బోలెడు కథారచయితలు, రచయిత్రులూ వున్నారు. కానీ నాకుమాత్రం ఇద్దరు కథకులే నచ్చారు.

వారు నాకెందుకునచ్చారో తెలిపేందుకు ప్రయత్నిస్తాను.

సాహిత్యం ఒకకళ. కథారచన వివిధ సాహితీ ప్రక్రియల్లో ఒకటి. సాహిత్యం విభిన్న సమకాలీన పరిస్థితుల్ని ప్రతిబింబించితీరాలని నా అభిప్రాయం.

యాంత్రికయుగంలో బ్రతుకుతూ, యాంత్రికయుగ సౌఖ్యాలనీ, సౌలభ్యాలనీ అడుగడుగునా అనుభవిస్తూ పాతకాలపునీతుల్నీ, ఆర్షధర్మాలనీ, ఫ్యూడల్‌యుగ ధార్మిక నైతికవిలువలనీ రచించే కవులన్నా, రచయితలన్నా నాకయిష్టం.

సాహిత్యానికి పలురకాల ప్రయోజనాలని అంటకట్టారు, అంటకట్టుతున్నారు. నా దృష్టిలో సాంఘిక ప్రయోజనాలని సాధించని సాహిత్యం అడవిగాచిన వెన్నెలేఅవుతుంది. సాహితీకారుడు తన కళద్వారా పాఠకుని చైతన్యాన్ని ప్రేరేపించి, సామాజిక సువ్యవస్థకు బాటలువేసేలా చేయడం అత్యవసరం.

సాంఘిక ప్రయోజనాన్ని ఆశించి, రచన సాగించే కథారచయితలను వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. సామాజిక ప్రయోజనాన్ని ఆశిస్తూనే, సిద్ధాంతానికి అనవసర ప్రాముఖ్యతయివ్వకుండా, 'కళ'కు ఎట్టి అంతరాయము కలుగకుండా, రచించేకథకులు ఇద్దరే యిద్దరు వున్నారు నాదృష్టిలో. వారు కొడవటిగంటి కుటుంబరావు, రాచకొండ విశ్వనాథశాస్త్రి.

389